

గెలుపు ఖాయం కావడంతో విజయోత్సాహంతో జనగామ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని ఎత్తుకొని జైకొడుతున్న కార్యకర్తలు, అభిమానులు



గెలుపు ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న జనగామ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



కుటుంబసభ్యులు, బీఆర్‌ఎస్ శ్రేణులతో కలిసి విజయ సంకేతం చూపుతున్న స్టేషన్‌ఘన్‌పూర్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి


# కాంగ్రెస్ గెలుపు

## ఉమ్మడి జిల్లాలో 10స్థానాలు 'హస్త'గతం

- హుస్నాబాద్, మంథని, ఇల్లందులోనూ..
- జనగామ, స్టేషన్ ఘన్‌పూర్‌లో బీఆర్‌ఎస్ విజయం
- ఎమ్మెల్యేలుగా ఇద్దరు ఎమ్మెల్సీలు
- నాలుగోసారి గెలిచిన కడియం శ్రీహరి
- తొలి ప్రయత్నంలోనే సత్తాచాటిన పల్లా
- హుజూరాబాద్, భద్రాచలంలోనూ గులాబీ గుబాళింపు
- ఉమ్మడి జిల్లా నుంచి ముగ్గురు మహిళలు
- సీతక్క, కొండా సురేఖ, యశస్విని శాసనసభకు..

వరంగల్, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 12 అసెంబ్లీ నియోజకవర్గాలకు గాను 10 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ గెలిచింది. రెండు స్థానాలను బీఆర్‌ఎస్ కైవసం చేసుకుంది. జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్‌లో గులాబీ జెండా రెపరెపలాడగా, వరంగల్ తూర్పు, పశ్చిమం, పరకాల, వర్ధన్నపేట, నర్సంపేట, పాలకుర్తి, మహబూబాబాద్, డోర్నకల్, భూపాలపల్లి, ములుగులో కాంగ్రెస్ అభ్యర్థులు గెలిచారు. పాలకుర్తిలో మామిడాల యశస్వినిరెడ్డి, డోర్నకల్‌లో జాటోతు రాంచంద్రునాయక్, మహబూబాబాద్‌లో భూక్య మురళీనాయక్, నర్సంపేటలో దొంతి మాధవరెడ్డి, పరకాలలో రేవూరి ప్రకాశ్‌రెడ్డి, వరంగల్ పశ్చిమలో నాయిని రాజేందర్‌రెడ్డి, వరంగల్ తూర్పులో కొండా సురేఖ, వర్ధన్నపేటలో కె.ఆర్.నాగరాజు, భూపాలపల్లిలో గండ్ర సత్యనారాయణరావు, ములుగులో ధనసరి అనసూయ(సీతక్క) గెలిచారు. మంథనిలో కాంగ్రెస్ అభ్యర్థి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, హుస్నాబాద్‌లో కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్, ఇల్లందు నియోజకవర్గంలో కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన కోరం కనుకయ్య గెలిచారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి, భద్రాచలంలో బీఆర్‌ఎస్ తరఫున పోటీ చేసిన తెల్లం వెంకటరావు విజయం సాధించారు. ఉమ్మడి వరంగల్ నియోజకవర్గంలో ముగ్గురు మహిళలు కొండా సురేఖ, ధనసరి అనసూయ, మామిడాల యశస్వినిరెడ్డి ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. ఎమ్మెల్యేగా పోటీ చేసిన తొలి ప్రయత్నంలోనే ఉమ్మడి జిల్లాలో ఐదుగురు విజయం సాధించారు. వీరిలో పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మామిడాల యశస్వినిరెడ్డి, భూక్య మురళీనాయక్, నాయిని రాజేందర్‌రెడ్డి, కె.ఆర్.నాగరాజు ఉన్నారు. ఎమ్మెల్సీలుగా ఉన్న కడియం శ్రీహరి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రస్తుత ఎన్నికల్లో ఎమ్మెల్యేలుగా గెలిచారు. కాగా కొండా సురేఖ ఐదోసారి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఐదోసారి, కడియం శ్రీహరి నాలుగోసారి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి నాలుగోసారి, ధనసరి అనసూయ, కోరం కనుకయ్య రెండోసారి, తెల్లం వెంకట్రావు మొదటిసారిగా ఎమ్మెల్యేలుగా గెలిచారు. హుజూరాబాద్‌లో ఏడుసార్లు గెలిచిన ఈటల రాజేందర్ ప్రస్తుత ఎన్నికల్లో ఓటమిపాలయ్యారు.

| నియోజకవర్గం | విజేత | రెండో స్థానం | మెజారిటీ |
|---|---|---|---|
| జనగామ | పల్లా రాజేశ్వర్‌రెడ్డి(బీఆర్‌ఎస్) | కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి(కాంగ్రెస్) | 15,783 |
| స్టేషన్ ఘన్‌పూర్ | కడియం శ్రీహరి(బీఆర్‌ఎస్) | సింగాపురం ఇందిర(కాంగ్రెస్) | 7,779 |
| పాలకుర్తి | మామిడాల యశస్విని(కాంగ్రెస్) | ఎర్రబెల్లి దయాకర్‌రావు(బీఆర్‌ఎస్) | 46,367 |
| డోర్నకల్ | జాటోత్ రామచంద్రునాయక్(కాంగ్రెస్) | ధరంసోత్ రెడ్యానాయక్(బీఆర్‌ఎస్) | 53,131 |
| మహబూబాదాబాద్ | భూక్య మురళీనాయక్(కాంగ్రెస్) | బానోత్ శంకర్‌నాయక్(బీఆర్‌ఎస్) | 50,171 |
| నర్సంపేట | దొంతి మాధవరెడ్డి(కాంగ్రెస్) | పెద్ది సుదర్శన్‌రెడ్డి(బీఆర్‌ఎస్) | 16,595 |
| పరకాల | రేవూరి ప్రకాశ్‌రెడ్డి(కాంగ్రెస్) | చల్లా ధర్మారెడ్డి(బీఆర్‌ఎస్) | 7,941 |
| వరంగల్ పశ్చిమ | నాయిని రాజేందర్‌రెడ్డి(కాంగ్రెస్) | దాస్యం వినయభాస్కర్(బీఆర్‌ఎస్) | 15,331 |
| వరంగల్ తూర్పు | కొండా సురేఖ(కాంగ్రెస్) | ఎర్రబెల్లి ప్రదీప్‌రావు(బీజేపీ) | 15,652 |
| వర్ధన్నపేట | కె.ఆర్.నాగరాజు(కాంగ్రెస్) | అరూరి రమేశ్ (బీఆర్‌ఎస్) | 10,551 |
| భూపాలపల్లి | గండ్ర సత్యనారాయణరావు(కాంగ్రెస్) | గండ్ర వెంకటరమణారెడ్డి(బీఆర్‌ఎస్) | 52,699 |
| ములుగు | ధనసరి అనసూయ (కాంగెస్) | బడే నాగజ్యోతి(బీఆర్‌ఎస్) | 33,700 |
| మంథని | దుద్దిళ్ల శ్రీధర్‌రాబు(కాంగ్రెస్) | పుట్ట మధుకర్(బీఆర్‌ఎస్) | 31,380 |
| హుస్నాబాద్ | పొన్నం ప్రభాకర్(కాంగ్రెస్) | ఒడితల సతీశ్‌కుమార్(బీఆర్‌ఎస్) | 19,344 |
| హుజూరాబాద్ | పాడి కౌశిక్‌రెడ్డి(బీఆర్‌ఎస్) | ఈటల రాజేందర్ (బీజేపీ) | 16,873 |
| ఇల్లందు | కోరం కనుకయ్య(కాంగ్రెస్) | బానోత్ హరిప్రియ(బీఆర్‌ఎస్) | 57,309 |
| భద్రాచలం | తెల్లం వెంకట్రావు(బీఆర్‌ఎస్) | పోదెం వీరయ్య(కాంగ్రెస్) | 5719 |



పల్లా గెలుపుతో పెంబర్తి వద్ద సంబురాలు చేసుకుంటున్న బీఆర్‌ఎస్ శ్రేణులు




ఎనుమాముల కౌంటింగ్ సెంటర్‌లో ..

### జనగామ, స్టేషన్ ఘన్‌పూర్‌లో

# గులాబీ గుబాళింపు..

బీఆర్‌ఎస్ అభ్యర్థులు 'పల్లా', 'కడియం' గెలుపు

- జిల్లాలో రెండు సెగ్మెంట్లలో బీఆర్‌ఎస్ హవా
- ట్రెండ్ చూసి మధ్యలోనే వెనుదిరిగిన కాంగ్రెస్ అభ్యర్థులు కొమ్మూరి, ఇందిర
- జనగామ బీఆర్‌ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డికి 15,783 ఓట్ల మెజార్టీ
- స్టేషన్‌ఘన్‌పూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి కడియం శ్రీహరికి 7,779 ఓట్ల మెజార్టీ
- బీజేపీ అభ్యర్థులకు డిపాజిట్ గల్లంతు



గెలుపు ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న కడియం శ్రీహరి



భద్రాచలంలో తెల్లం వెంకట్రావుకు స్వాగతం పలుకుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

జనగామ, డిసెంబర్ 3(నమస్తే తెలంగాణ)/ స్టేషన్‌ఘన్‌పూర్ : జనగామ జిల్లాలోని మూడు అసెంబ్లీ స్థానాలకు గాను రెండింట్లో బీఆర్‌ఎస్ జెండా ఎగిరింది. జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్‌లో ముచ్చటగా మూడోసారి గులాబీ గుబాళించగా, పాలకుర్తిలో ఎర్రబెల్లి దయాకర్‌రావు ఓటమి పాలయ్యారు. ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థి మామిడాల యశస్వినిరెడ్డి గెలుపొందారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత 2014 ఎన్నికలు సహా 2018లో జరిగిన ముందస్తు ఎన్నికల్లో రెండు పర్యాయాలు జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్‌ను ఆదరించిన ప్రజలు కాంగ్రెస్ హవాలోనూ జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ ప్రజలు పార్టీ అభ్యర్థులను అక్కున చేర్చుకున్నారు. ఆదివారం జనగామ మండలం పెంబర్తిలోని పాత విద్యాభారతి ఇంజినీరింగ్ కళాశాల (వీబీఐటీ)లో లెక్కింపు జరుగగా, జనగామ అసెంబ్లీ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి తన సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిపై 15,783 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. అలాగే స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి కడియం శ్రీహరి తన సమీప ప్రత్యర్థి సింగాపురం ఇందిరపై 7,779 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. జనగామలో బీఆర్‌ఎస్ అభ్యర్థి పల్లాకు మొత్తం 98,557 ఓట్లు రాగా, కాంగ్రెస్ అభ్యర్థి కొమ్మూరికి 83,192 ఓట్లు వచ్చాయి. బీజేపీ అభ్యర్థి ఆరుట్ల దశమంత్‌రెడ్డి మాత్రం కేవలం 7,595 ఓట్లకు పరిమితమయ్యా రు. ఆయనతోపాటు పాలకుర్తిలో లేగ రాంమోహన్‌రెడ్డి, స్టేషన్‌ఘన్‌పూర్‌లో గుండె విజయ రామారావు సైతం డిపాజిట్ కోల్పోయారు. జనగామ సెగ్మెంట్‌లో మొత్తం 20 రౌండ్లలో జరిగిన ఓట్ల లెక్కింపులో ఆఖరి రౌండ్ మినహా ప్రతీ రౌండ్‌లోనూ బీఆర్‌ఎస్ అభ్యర్థి పల్లా అధిక్యత కనబరిచారు. ఇక్కడ తొలి రౌండ్ నుంచే 1,304 ఓట్ల లీడ్‌తో ప్రారంభమైన జనగామ అభ్యర్థి ఎన్నికల ఫలితం 19 రౌండ్ల వరకు ఏ మాత్రం తగ్గకుండా కొనసాగింది. చివరిదైన ఒక్క 20వ రౌండ్‌లోనే కాంగ్రెస్ అభ్యర్థికి 435 ఓట్ల స్వల్ప ఆధిక్యం లభించింది. జనగామ జిల్లాలో మూడు నియోజకవర్గాలకు గానూ రెండు స్థానాల ఓట్ల లెక్కింపు ఫలితాలలో మధ్యాహ్నం వరకు ట్రేండ్ బీఆర్‌ఎస్ వైపు కొనసాగుతుండడంతో జనగామ కాంగ్రెస్ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి కౌంటింగ్ కేంద్రం నుంచి మధ్యలోనే వెనుదిరిగారు. స్టేషన్ ఘన్‌పూర్ అభ్యర్థి ఇందిర మాత్రం కౌంటింగ్ కేంద్రానికి దూరంగా ఉండి తమ క్యాడర్‌ను పంపించగా, ఫలితాల సరళిని గమనించిన నాయకులు, కార్యకర్తలు మధ్యలోనే వెళ్లి పోయారు. ఇక కడియం శ్రీహరి గెలుపు ఖాయమని తేలిన తర్వాత కౌంటింగ్ కేంద్రానికి చేరుకొని లెక్కింపు సరళిని పరిశీలించి రిటర్నింగ్ అధికారి వాసాల రాంమూర్తి నుంచి గెలుపు పత్రాన్ని అందుకున్నారు. జనగామ బీఆర్‌ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాత్రం ప్రారంభం నుంచే కౌంటింగ్ కేంద్రంలో ఉండి పోస్టల్ ఓట్ల లెక్కింపు సహా రౌండ్ల వారీగా జరిగిన లెక్కింపును స్వయంగా పర్యవేక్షించారు. పాలకుర్తి అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్‌రావు కౌంటింగ్ కేంద్రానికి దూరంగా ఉండగా, కాంగ్రెస్ అభ్యర్థి యశస్వినిరెడ్డి ఫలితం తనకు అనుకూలంగా ఉందన్న సమాచారంతో కేంద్రానికి వచ్చారు. యశస్వినిరెడ్డి 47,547 ఓట్ల మెజార్టీతో ఎర్రబెల్లిపై విజయం సాధించారు. కాగా, జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి అభ్యర్థులు ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల నుంచి గెలుపు ధ్రువీకరణ పత్రాలు అందుకున్నారు.



విజయోత్సాహంతో ప్రజలకు అభివాదం చేస్తున్న తెల్లం వెంకట్రావు

### రౌండ్ రౌండ్‌కూ 'పల్లా'కు ఆధిక్యం

జనగామ అసెంబ్లీ నియోజకవర్గం ఓట్ల లెక్కింపు క్షణక్షణం ఉత్కంఠ భరితంగా పోస్టల్ ఓట్ల లెక్కింపు మొదలు తొలి ఐదు రౌండ్ల వరకు మెజార్టీపై ఆకస్తి నెలకొన్నది. అయితే ఇక్కడ మొత్తం 20 రౌండ్లకు గాను చివరి రౌండ్ మినహా మిగిలిన 19 రౌండ్లలోనూ బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆధిక్యతను కనబరిస్తూ విజయాన్ని సొంతం చేసుకున్నారు. మొదటి రౌండ్‌లో పల్లా 5578 ఓట్లు సాధిస్తే, కాంగ్రెస్ అభ్యర్థి 4,274 ఓట్లకు పరిమితమై 1304 లీడ్‌తో బీఆర్‌ఎస్ బోణీకొట్టింది. ఇలా ఒక్కో రౌండ్‌లో ఆధిక్యం ప్రదర్శిస్తూ మెజార్టీ దక్కించుకున్నారు.

# ఈటల కోటకు కౌశిక్ గండి

- 20ఏళ్ల చరిత్రను తిరగరాసిన పాడి
- హుజూరాబాద్‌ను కైవసం చేసుకున్న బీఆర్‌ఎస్



పాడి కౌశిక్‌రెడ్డి గెలుపుతో కమలాపూర్‌లో సంబురాలు చేసుకుంటున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

కమలాపూర్, డిసెంబర్ 3 : బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ కోటకు గండికొట్టి హుజూరాబాద్ నియోజకవర్గం బీఆర్‌ఎస్‌దేనని పాడి కౌశిక్‌రెడ్డి విజయం సాధించి నిరూపించాడు. టీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భావం నుంచి నియోజకవర్గంలో గులాబీ జెండా ఎగురవేస్తూ వచ్చింది. కారు గుర్తుపై ఆరుసార్లు ఎమ్మెల్యేగా ఈటల రాజేందర్ గెలిచారు. కేసీఆర్ ప్రత్యేక స్థానం కల్పించడంతో మంత్రిగా రెండుసార్లు చేపట్టి తిరుగులేని నేతగా ఎదిగారు. ఆ తర్వాత టీఆర్‌ఎస్‌ను వదిలి బయటకు వచ్చిన ఈటల 2021లో బీజేపీ నుంచి ఎమ్మెల్యేగా పోటీచేసి గెలుపొందారు. హుజూరాబాద్‌లో తనకు తిరుగులేదని ఈటల అహంభావంతో పదవులు కట్టబెట్టిన కేసీఆర్‌పై పోరాటం అంటూ ఊదరగొట్టాడు. బీజేపీ అధికారంలోకి వస్తే తనే ముఖ్యమంత్రి అంటూ చెప్పుకుంటూ రాష్ట్రంలోని నియోజకవర్గాల్లో పర్యటించారు. ఆదుకున్న హుజూరాబాద్ ప్రజలను మరచిపోవడంతో బీజేపీ ఎమ్మెల్యేగా గెలిచి రెండేళ్లు అయిన నియోజకవర్గం వైపు చూడకపోవడం, కేంద్రంలో అధికారంలో బీజేపీ ఉన్న అభివృద్ధికి నిధులు తేకపోవడంతో ప్రజలకు దూరమయ్యారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పోటీచేస్తున్న గజ్వేల్‌లో పోటీ చేయడంతో హుజూరాబాద్ నియోజకవర్గ ప్రజల ఆదరణ కోల్పోయారు.

### చరిత్ర తిరగరాసిన పాడి

పాడి కౌశిక్‌రెడ్డి హుజూరాబాద్ ఎమ్మెల్యేగా గెలుపొంది 20ఏళ్ల చరిత్రను తిరగరాశారు. బీఆర్‌ఎస్‌కు పెట్టని కోటగా ఉన్న హుజూరాబాద్ నియోజకవర్గం ఉప ఎన్నికల్లో ఓటమి పాలుకావడంతో కేసీఆర్ ఎమ్మెల్సీ విప్ కౌశిక్‌రెడ్డికి పదవులు కట్టబెట్టి నియోజకవర్గ బాధ్యతలు అప్పగించారు. బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి కౌశిక్‌రెడ్డి నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధి పనులు చేపట్టి ప్రజల్లోకి దూసుకుపోయాడు. పాడి కౌశిక్‌రెడ్డి నియోజకవర్గంలో ఈటలను మరిపించేలా ప్రజలను తనవైపు తిప్పుకోవడంలో విజయవంతమయ్యారు. నియోజకవర్గంలో తిరుగేలేదని విర్రవీగిన ఈటలకు 16వేలకుపైగా ఓట్ల మెజారిటీతో గెలుపొంది చరిత్రను సృష్టించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ హవా కొనసాగిన నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీ ఓట్ల సునామీ కొనసాగించారు. సర్వేల అంచనాలకు అంతుపట్టని విధంగా కౌశిక్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలుపొంది హుజూరాబాద్ గడ్డపై గులాబీ జెండా ఎగురవేశాడు.

సమైకాంధ్ర పాలనలో కమలాపూర్ నియోజకవర్గం అప్పటి టీడీపీ ఎమ్మెల్యేగా ముద్దసాని దామోదర్‌రెడ్డికి 20ఏళ్లు అవకాశం ఇచ్చారు. తెలంగాణ ఉద్యమంతో టీఆర్‌ఎస్ ఎమ్మెల్యేగా ఈటల రాజేందర్ 2004లో గెలిచాడు. 2009లో నియోజకవర్గాల పునర్విభజనతో హుజూరాబాద్ నియోజకవర్గం ఏర్పడింది. హుజూరాబాద్ టీఆర్‌ఎస్ తరపున పోటీచేసి ఎమ్మెల్యేగా ఈటల రాజేందర్ నాల్గు సార్లు, 2021లో బీజేపీ ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 20ఏళ్లు హుజూరాబాద్ ప్రజలు అవకాశం ఇవ్వడంతో తనకు తిరుగలేదని, తనకు ఓటమి లేదంటూ ఊహించిన ఈటలకు 2023లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేగా కౌశిక్‌రెడ్డిని గెలిపించి గట్టి షాక్ ఇచ్చారు. నియోజకవర్గ ప్రజలు ఒక్కసారి ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే ఇరవై ఏళ్లపాటు ఆదరిస్తారని దామోదర్‌రెడ్డి, ఈటల రాజేందర్‌లతో నిరూపితమైంది. ఎమ్మెల్యేగా గెలిచిన కౌశిక్‌రెడ్డి నియోజకవర్గ ప్రజల మనసులు గెలిచి 20ఏళ్లు ఏలుతాడా ? లేదా? ప్రజలు చర్చించుకుంటున్నారు.